నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, శుక్రవారం 12 జనవరి 2024 | SANGAREDDY

బుధవారం ప్రొటోకాల్ ఉల్లంఘనపై మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ప్రొటోకాల్ రగడ

- ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫిర్యాదు
- ప్రొటోకాల్ అమలుపై చీఫ్ సెక్రటరీ, కలెక్టర్‌కు లేఖలు
- ప్రొటోకాల్ అమలు చేయడంలో సంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం విఫలమవుతున్నట్లు ఆరోపణ

సంగారెడ్డి జనవరి 11 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా ఎన్నికైన తనకు ప్రొటోకాల్ విషయంలో సమస్యలు తలెత్తుతుండడం దురదృష్టకరమన్నారు. శాసనసభ, అధికారిక నిబంధనలను అనుసరించి ఎమ్మెల్యేగా ఎన్నికైన తనకు అధికారులు కచ్చితంగా ప్రొటోకాల్ అమలు చేయాల్సి ఉందని తెలిపారు. నియోజకవర్గంలో అధికార యంత్రాంగం ప్రొటోకాల్ అమలుచేయడంలో విఫలమవుతున్నట్లు చెప్పారు. బుధవారం సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ అమలు చేయకుండా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తాను హాజరైనా అక్కడి అధికారులు ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించలేదన్నారు. ఎమ్మెల్యే హోదాలో తాను కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాల్సి ఉండగా, అధికారులు చెక్కులు పంపిణీ చేయనివ్వలేదని ఫిర్యాదు చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వచ్చే వరకు వేచిఉండేలా చేశారని, గంటన్నర వేచి చూసినా నిర్మలారెడ్డి రాలేదన్నారు. దీంతో తాను, లబ్ధిదారులు ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం చెక్కులు పంపిణీ చేస్తానని చెప్పినా అధికారులు స్పందించలేదన్నారు. దీంతో కార్యక్రమం నుంచి వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. తాను వెళ్లాక కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయించినట్లు చెప్పారు. సదాశివపేటలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సైతం అధికారులు ప్రొటోకాల్ పాటించలేదన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఇటీవల నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని స్పీకర్‌కు తెలిపారు. అధికార యంత్రాంగం కచ్చితంగా ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. అలాగే చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతిలకు లేఖ రాశారు.

మహనీయుల త్యాగం వెలకట్టలేనిది

- సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

సిద్దిపేటలో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, జనవరి 11: మహనీయుల త్యాగం వెలకట్టలేనిదని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో గురువారం జరిగిన వడ్డె ఓబన్న 217వ జయంతిలో ఆమె పాల్గొన్నారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు త్యాగం చేసిన ఎంతో మంది చరిత్ర బయటకు రాలేదన్నారు. వడ్డె ఓబన్నను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పలువురు అధికారులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గూడు చెదిరే!

'గృహలక్ష్మి' పథకం రద్దు...

- పేదలపై దెబ్బ కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సిద్దిపేట జిల్లాలో 16,800 ఇండ్లను రద్దు చేసిన సర్కారు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

సిద్దిపేట, జనవరి 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇంటి స్థలం ఉండి నిర్మాణం చేసుకోవడానికి ముందుకు వచ్చిన అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేసింది. దీంతో వారంతా భూమిపూజ చేసుకొని ఇంటి నిర్మాణాన్ని మొదలు పెట్టారు. తీరా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద మంజూరైన 16,800 ఇండ్లను రద్దు చేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తే... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లను రద్దు చేసిందంటూ వారు మండిపడుతున్నారు.పేదలపై కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గృహలక్ష్మి పథకం కింద మంజూరైన వారికి యథావిధిగా ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సైతం గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించాలని ఏకగ్రీవ తీర్మానం సైతం చేసి ప్రభుత్వానికి పంపారు.

తొలి విడతగా 16,800 ఇండ్లు మంజూరు

సిద్దిపేట జిల్లాలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం కింద ఇంటి స్థలం ఉన్నవారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల నుంచి 51,685 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులను అప్పటి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టింది. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేయగా వాటిలో 33,471 మంది అర్హులు అని తేలింది. దీంతో అర్హులైన వారికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి ఆ మొత్తం చెల్లించాలని నిర్ణయించింది. అప్పటి ప్రభుత్వం జిల్లాకు తొలి విడతగా 16,800 ఇండ్లు మంజూరు చేసింది. వీటిలో సిద్దిపేట నియోజకవర్గానికి 3,000, గజ్వేల్ నియోజకవర్గానికి 7,950, దుబ్బాక నియోజకవర్గానికి 2,400, హుస్నాబాద్, జనగామ నియోజకవర్గాలకు 1,500, మానకొండూరు నియోజకవర్గానికి 500 ఇండ్లు మంజూరు చేసింది. వీటిలో లబ్ధిదారులకు మొదటగా దుబ్బాక నియోజకవర్గంలో 869 మంది, గజ్వేల్ నియోజకవర్గంలో 7,790 మంది, హుస్నాబాద్ నియోజకవర్గంలో 294మంది, మానకొండూరు నియోజకవర్గంలో 443 మంది, సిద్దిపేట నియోజకవర్గంలో 2,363 మందికి ఎన్నికల ముందు గత అక్టోబర్‌లో మంజూరు పత్రాలు అందించారు. దీంతో వారంతా ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పుడు నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. నిరుపేదల గూడు కట్టుకోవడానికి సహకరించాల్సిన ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతుందని వారు మండిపడుతున్నారు. ప్రభుత్వాలు మారగానే మంజూరైన పథకాలను రద్దు చేయడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. కొత్తగా ఇచ్చేవి ఉంటే అవి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి గానీ ఇదివరకే మంజూరైన వాటిని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తాము పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం చేస్తేనే తమకు బిల్లులు ఇవ్వండి అంతే గానీ ఉన్నఫలంగా మంజూరైన ఇండ్లను రద్దు చేయడం సరికాదని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీల పథకంలో వీటిని చేర్చి అమలు చేయలని డిమాండ్ చేస్తున్నారు. పేదలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకోవడం సరికాదని వారు అంటున్నారు. తామంతా ఇంటి నిర్మాణాలు ప్రారంభించాం.. ఇవాళ ఉన్నఫలంగా మంజూరైన ఇండ్లను రద్దు చేయడంతో తామంతా రోడ్డున పడ్డామని లబ్ధిదారులు వాపోతున్నారు.

సిద్దిపేటలో విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

జాతీయ క్రీడాకారులకు అభినందనలు

దుబ్బాక టౌన్, జనవరి 11: జాతీయ క్రీడల్లో రాణిస్తున్న దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులను సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. ఇటీవల వివిధ జాతీయ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు కర్నాల అక్షయ, దుద్దెడ అక్షయ, కర్నాల వరలక్ష్మిలను గురువారం సిద్దిపేటలో వారు సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాస్, ఉపాధ్యాయుడు సాదత్ అలీ, సీఆర్‌పీ, పీఈటీలు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

కుకునూర్‌పల్లి, జనవరి 11: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం సత్తయ్య, సర్పంచ్ జయంతీ నరేందర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షి షా
- పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలి
- ఏడు నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించాలి
- మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రానున్న లోక్‌సభ ఎన్నికల-24ను దృష్టిలో ఉంచుకుని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో జిల్లా ఎస్పీ బి.బాలస్వామి, సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల గురించి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. (మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సంగారెడ్డి, పటాన్‌చెరు) నియోజకవర్గాల్లో వనరబుల్ మ్యాపింగ్ తయారు చేయాలని, ఫామ్6, ఫామ్8 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే త్వరగా పూర్తి చేయాలని, ఫామ్ ప్రాసెస్ ఏదీ పెండింగ్‌లో ఉండొద్దన్నారు. స్వీప్ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఎన్నికల సిబ్బందిని నియమించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

SST, AT, VST, FST, FS, MCC లాంటి అన్ని టీమ్‌లను పకడ్బందీగా నియమించాలని, నూతన టీమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఏడు నియోజకవర్గాలకు నోడల్ అధికారుల నియామకం పూర్తి చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్లను అధికారులు పరిశీలించాలన్నారు. ఓటరు నమోదు పూర్తిచేయాలని, నమోదులో ఫొటో మార్పు, డబుల్ ఎంట్రీ, చిరునామా మార్పు, మరణించిన వారి వివరాలు సరిచూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వాలన్నారు. 1, 2వ ర్యాండమైజేషన్ పూర్తి చేయాలని, పోస్టల్ బ్యాలెట్, ఫామ్ 12 పూర్తి చేయాలని, ఓటరు జాబితాను చివరి పబ్లికేషన్‌కు పూర్తి చేసి అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యాదవరెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కేసీఆర్‌తోనే గజ్వేల్‌కు గుర్తింపు

- రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికైన గజ్వేల్
- అట్టహాసంగా ప్రారంభమైన 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

గజ్వేల్ అర్బన్, జనవరి 11: గులాబీ అధినేత, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ వల్లనే నియోజకవర్గానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్‌గుప్తా అన్నారు. గజ్వేల్‌లో గురువారం సాయంత్రం 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలను కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, కబడ్డీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ దండుగల రాజ్యలక్ష్మితో కలిసి వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ క్రీడా పతకాలను ఆవిష్కరించారు. అంతకు ముందు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి అతిథులకు గౌరవవందనం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ వల్లనే గజ్వేల్ నియోజకవర్గానికి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందన్నారు. కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన నాటి నుంచే ఎన్నో రాష్ట్ర స్థాయి క్రీడలకు గజ్వేల్ ఆతిథ్యమిచ్చిందన్నారు. గజ్వేల్‌లో క్రీడాహబ్ ఏర్పాటుకు 22 ఎకరాలు కేటాయించిందని, ఉడెన్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, కబడ్డీ అసోసియేషన్, ఒలింపిక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, స్థానిక కౌన్సిలర్ శ్యామల, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, బొగ్గుల చందు, శిరీష, నాయకులు, వివిధ జిల్లాల క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

గుండెల్లో పెట్టుకున్నారు... గుర్తుండేలా పనిచేస్తా

- 12 ఎంపీ సీట్లు సాధించడమే ధ్యేయం
- నీలిమా దవాఖానలో ఉచిత వైద్యం
- కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ఎమ్మెల్యే పల్లాను సన్మానించిన గులాబీ శ్రేణులు



చేర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 11: ''చేర్యాల ప్రాంత ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇచ్చారు...గుండెల్లో పెట్టుకున్నారు... గుర్తుండేలా పనిచేస్తా'' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలతో కృతజ్ఞత సభ పార్టీ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, గీస భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని కొండత అండగా కేసీఆర్ సారు ఉన్నారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే చెప్పిన తేదీలను మర్చిపోయారని హెద్దేవ చేశారు. డేట్లు చెప్పారు హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు.

నీలిమా దవాఖానలో ఉచిత వైద్యం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నీలిమా దవాఖానలో నియోజకవర్గ ప్రజలకు పార్టీలకతీతంగా ఉచిత వైద్యం అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజవకర్గ ప్రజలు రేషన్‌కార్డు తీసుకువెళ్లి చక్కగా వైద్యం చేయించుకోవచ్చని, ఇప్పటి వరకు 1084 మందికి రూ.98లక్షల విలువైన వైద్యం, మందులు తదితర సేవలు అందించినట్లు తెలిపారు.త్వరలో రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 12 సీట్లు సాధించేందుకు లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీలు కరుణాకర్, కీర్త నాకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బాల్‌నర్సయ్య, ఏకానందం, రంజితాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

మద్దూరు(ధూళిమిట్ట), జనగామ11: జనగామ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మద్దూరులోని తాజ్‌మహల్ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, యాదగిరి అధ్యక్షతన మద్దూరు, ధూళిమిట్ట మండలాల కార్యకర్తల కృతజ్ఞత సమావేశానికి ఆయన ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మల్లేశం, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరీఫ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వరలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రయ్య, వెంకట్రమణారెడ్డి, రాజమల్లయ్య, ఐలయ్య, సర్పంచ్‌లు సుదర్శన్, రవీందర్‌రెడ్డి, కనకయ్య, దీపిక, భాగ్యలక్ష్మి, రాజమ్మ, ఎంపీటీసీలు కనకమ్మ, సమ్మయ్య, నర్సింహులు, సత్యకళ పాల్గొన్నారు.

మద్దూరులో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

సంక్రాంతికి 110 స్పెషల్ బస్సులు

- దూరప్రాంతాలకు అదనంగా 20 బస్సులు
- 12 నుంచి 14 వరకు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం
- మహిళలకు టికెట్లు లేకుండా నడపనున్న ఆర్టీసీ
- అదనపు చార్జీలు వసూలు చేయమన్న ఆర్టీసీ అధికారులు
- ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమన్న ఆర్ఎం

సంగారెడ్డి, జనవరి 11: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెదక్ రీజియన్ నుంచి తెలంగాణలోని ముఖ్యమైన పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. పండుగకు మూడు రోజులపాటు ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో సొంత గ్రామాలు, పట్టణాలకు వెళ్లేందుకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు అధికారులు బస్సులను సిద్ధం చేశారు. పండుగకు వివిధ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న ప్రజలు సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణం చేస్తారు. అలాంటివారి కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఉమ్మడి మెదక్ రీజియన్ నుంచి 110 బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. బస్సులను హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు పలు ముఖ్యమైన ప్రదేశాలకు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 8 ఆర్టీసీ డిపోల నుంచి దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు.

అదనపు చార్జీలు లేకుండా ప్రయాణం

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ప్రస్తుత చార్జీలతోనే ప్రయాణం చేసేవిధంగా సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపించేందుకు చర్యలు చేపట్టారు. అదనపు చార్జీలు లేకుండా ముందుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంక్రాంతికి వేసిన ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి చార్జీలు పెంచలేదు. రాష్ట్రంలోని దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యానికి ఇబ్బందులు కలుగకుండా అవసరమైతే అదనపు బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మెదక్ డిపో నుంచి 12 బస్సులు, నారాయణఖేడ్ నుంచి 10, నర్సాపూర్ నుంచి 9, సంగారెడ్డి నుంచి13, జహీరాబాద్ నుంచి15, సిద్దిపేట్ నుంచి 27, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నుంచి 15, దుబ్బాక డిపో నుంచి 9 బస్సులు నడుస్తాయని అధికారుల తెలిపారు.

ఉమ్మడి మెదక్ రీజియన్ నుంచి ఏర్పాట్లు

మహిళలకు ఉచిత ప్రయాణం

ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఏ బస్సు చూసినా మహిళలతో నిండిపోతున్నది. సంక్రాంతి పండుగకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో మరింత రద్దీ పెరుగనున్నది. సంక్రాంతి పండుగకు తెలంగాణలోని ప్రధాన నగరాలు, పట్టణాలకు మెదక్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడువనున్నాయి. ఈ బస్సులు ఈనెల 12 నుంచి14 వరకు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తెలంగాణ పరిధిలో నడిచే 110 బస్సులు జూబ్లీ బస్‌స్టేషన్, ఇమ్లీబన్ బస్‌స్టేషన్, లింగంపల్లి నుంచి మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అలాగే లింగంపల్లి నుంచి జహీరాబాద్, మెదక్, నారాయణఖేడ్, పిట్లం, బిచుకుందలకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ మెదక్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయి.